'జిజ్ఞాస'లో మెరిశారు..

- రాష్ట్రస్థాయిలో అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థుల ప్రతిభ



ఇటీవల జిజ్ఞాసలో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి అందుకున్న విద్యార్థులు

వేములవాడఅర్బన్: ఆ కళాశాల కామర్స్ అధ్యాపకుడి ప్రోత్సాహం, మార్గదర్శనం, సూచనలతో కామర్స్ విద్యార్థులు పరిశోధన ప్రాజెక్టులపై అమితమైన ఆసక్తి, కృషి, పట్టుదలతో వరుసగా రెండుసార్లు రాష్ట్రస్థాయిలో జిజ్ఞాస బహుమతులను సాధించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పట్టుదలతో రాష్ట్రస్థాయిలో పోటీపడి వరుసగా రాష్ట్రస్థాయి బహుమతులను తీసుకురావడంతో కళాశాల బృందం, పలువురు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల విద్యాశాఖ ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జిజ్ఞాస 2023–24 రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించారు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన 20 కామర్స్ ప్రాజెక్టుల్లో అగ్రహారం కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం చేతుల మీదుగా ప్రాజెక్ట్ పర్యవేక్షకులు కామర్స్ అధ్యాపకుడు ఎం.మల్లారెడ్డి, విద్యార్థులు వి.సుష్మ, ఎం.లహరిక, ఇ.రాజేశ్, జి.యశ్వంత్, పి.అనిరుద్ రూ.21వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను స్వీకరించారు.

రైతులపై..

ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని రైతుల ఆదాయం పెంచడంలో, అప్పుల భారం తగ్గించడంలో రైతుబంధు ప్రభావం ఏ విధంగా ఉంది.. ప్రస్తుత సొమ్ము సరిపోతుందా లేదా ఇంకా పెంచాలా.. రైతుబంధు సొమ్ముకు పరిమితి విధించాలా.. కౌలు రైతులకు రైతుబంధును అమలు చేయాలా.. రైతుబంధు సొమ్మును ఎంతమేరకు పెంచాలి.. రైతుబంధు పథకం అమలు చేయడంలో ఉన్న సమస్యలు సవాళ్లను తెలుపుతూ వాటికి పరిష్కారం మార్గాలను నివేదించారు.

ప్రథమ బహుమతి..

కళాశాల విద్యాశాఖ గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల పోటీల్లో అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు పర్సెప్షన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ టువార్డ్స్ డిజిటల్ పేమెంట్స్–ఏ స్టడీ ఆఫ్ సిరిసిల్ల టౌన్ అనే అంశంపై రూపొందించిన స్టడీ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైన 23 కామర్స్ ప్రాజెక్టుల్లో ప్రథమ స్థానం సాధించింది. దాంతో తెలంగాణ ఉన్నత విద్యాకౌన్సిల్ చైర్మన్ ఆచార్య లింబాద్రి చేతుల మీదుగా రూ.30వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను స్వీకరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ చెల్లింపుల పట్ల పట్టణంలోని వీధి వ్యాపారులకు అవగాహన, వారు ఉపయోగిస్తున్న వివిధ డిజిటల్ వాలెట్లు డిజిటల్ చెల్లింపుల్లో ఎదుర్కొంటున్న సమస్యలు తెలుపుతూ వాటికి పరిష్కార మార్గాలను నివేదించారు.



అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పరిశోధన వైపు ప్రోత్సహిస్తా



విద్యార్థుల్లో పరిశోధనపై జిజ్ఞాస కలిగించి వారిచే స్థానిక సమస్యలపై పరిశోధన చేయించడం ద్వారా పరిష్కార మార్గాలను కనుక్కోవడం ఆనందంగా ఉంది. నేను మార్గదర్శకత్వం చేసిన ప్రాజెక్టులకు బహుమతి సాధించడం గర్వంగా ఉంది. పరిశోధన పత్రాలను అంతర్జాతీయ జర్నల్లో ప్రచురించడం మరువలేనిది. రానున్న రోజుల్లో మరింతమంది విద్యార్థులను పరిశోధన వైపు ప్రోత్సహిస్తా.

– ఎం.మల్లారెడ్డి, కామర్స్ సహాయ ఆచార్యులు, రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత, అగ్రహారం కళాశాల

సంతోషంగా ఉంది



గత సంవత్సరం కామర్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో జిజ్ఞాస ప్రథమ బహుమతి సాధించాం. ఈ సంవత్సరం రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతిని సాధించడం చాలా సంతోషంగా ఉంది.

– వి.సుష్మ, బీకాం మూడో సంవత్సరం విద్యార్థి, అగ్రహారం

ఆసక్తి పెరిగింది



ఈ బహుమతులు పరిశోధనపై మరింత ఆసక్తిని పెంపొందించాయి. వివిధ కళాశాలల నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన 20 కామర్స్ ప్రాజెక్టుల్లో మాకు ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

– ఎం.లహరిక, బీకాం మూడో సంవత్సరం విద్యార్థి, అగ్రహారం

ఉద్యోగానికి దోహదం



క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లి వివిధ అంశాలు నేర్చుకోవడం ఉత్సాహాన్నిచ్చింది. పరిశోధనకు సంబంధించి అనేక విషయాలతోపాటు ప్రజెంటేషన్ స్కిల్స్.. కమ్యూనికేషన్స్ స్కిల్స్ అభివృద్ధి చెందాయి. ఇవి భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించడానికి చాలా ఉపయోగపడతాయి.

– పి.అనిరుద్, బీకాం రెండో సంవత్సరం విద్యార్థి, అగ్రహారం

సార్‌కు ధన్యవాదాలు



జిజ్ఞాస విద్యార్థి అధ్యయన ప్రాజెక్ట్ ద్వారా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పరిశోధన ఎలా చేయాలి అన్నది క్షుణ్ణంగా పరిశీలించి తెలుసుకున్నాం. మాకు ఇంతటి చక్కని అవకాశమిచ్చిన అధ్యాపకుడు మల్లారెడ్డి సార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– ఇ.రాజేశ్, బీకాం రెండో సంవత్సరం విద్యార్థి, అగ్రహారం

క్లుప్తంగా

దుబాయ్ చేరుకున్న ప్రభుత్వ విప్



ఆది శ్రీనివాస్‌కు దుబాయ్ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న ఎన్‌ఆర్‌ఐలు

వేములవాడ: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాలుగు రోజుల దుబాయ్ పర్యటనకు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. దుబాయ్‌కి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో ప్రముఖ ఎన్‌ఆర్‌ఐలు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ పాలసీపై ప్రముఖులతో ఆది శ్రీనివాస్ చర్చించనున్నారు.

మూత్ర విసర్జనకు రుసుము మినహాయించాలి



వినతి పత్రం సమర్పిస్తున్న పౌర సంక్షేమ సమితి బాధ్యులు

సిరిసిల్లటౌన్: మూత్ర విసర్జనకు సులభ్ కాంప్లెక్స్‌లో రుసుము మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం పౌర సంక్షేమ సమితి బాధ్యులు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. పట్టణంలోని సులభ్ కాంప్లెక్సుల్లో అన్ని రకాల సేవలకు నిర్వాహకులు రుసుము తీసుకుంటున్నారని వివరించారు. అనేక ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు మరుగుదొడ్లు వినియోగించుకుంటే నిర్ణీత రుసుము తీసుకోవడంతోపాటు అత్యవసర పరిస్థితిలో మూత్ర విసర్జనకు సులభ్ కాంప్లెక్ నిర్వాహకులు డబ్బులు తీసుకోవడం సరికాదన్నారు. సమితి అధ్యక్షుడు బియంకార్ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గణేశ్, చిప్ప దేవదాసు, సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు చికోటి అనిల్, వేముల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో మొక్కు చెల్లింపు



దర్గాలో టాటా మ్యాజిక్ యజమానులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల టాటా మ్యాజిక్ యూనియన్ ఆధ్వర్యంలో వాహన యజమానులు ర్యాలీ నిర్వహించి ఎల్లారెడ్డిపేటలోని దర్గాలో మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసు బందోబస్తు మధ్య సాగిన ర్యాలీలో అధికారులు, ప్రజల సమన్వయంతో బాగున్నామని, దీనికి తోడు భగవంతుడి కృప ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడు వల్లాల వెంకటేశం, ఉపాధ్యక్షుడు పాముల రాజేందర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి విశ్వనాథుల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండెపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.కనకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్ వెహికల్, వెల్డర్, డీఎం సివిల్, మెకానిక్ డీజిల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. 15 ఏళ్లు నిండి పదోతరగతి పాస్ అయిన అభ్యర్థులు ఈనెల 16 నుంచి జూన్ 10 వరకు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల మండెపల్లిలో సంప్రదించాలని చెప్పారు.

అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చుడే..



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: బీఆర్‌ఎస్ నాయకులకు పని లేదని, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకిచ్చిన మాట ప్రకారం సన్న, దొడ్డు వడ్లన్నింటికీ రూ.500 చొప్పున బోనస్ ఇచ్చుడేనన్నారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని కోరారు. నాయకులు గౌస్, గిరిధర్‌రెడ్డి, లింగం గౌడ్, బాబు, బండారి బాల్‌రెడ్డి, రాంరెడ్డి, రాజ్ కుమార్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, పందిర్ల సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వేములవాడ: ఇటీవల వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన అవదూత గంగయ్యకు అగ్రహారం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. గంగయ్య కాలు, చేయి విరగడంతోపాటు కాలేయం సమస్యతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్‌కు సుమారు రూ.3లక్షల నుంచి రూ.4లక్షలు ఖర్చవుతాయని వైద్యులు తెలపడంతో.. గంగయ్య కుటుంబ సభ్యులు మై వేములవాడ చారిటబుల్ ట్రస్టును కలిశారు. 36 మంది దాతలు మానవతా దృక్పథంతో రూ.12,427 అందించడంతో.. శుక్రవారం ట్రస్టు సభ్యులు కరీంనగర్‌కు చేరుకొని గంగయ్యకు నగదు అందజేసినట్లు ట్రస్టు ప్రతినిధి మధు మహేశ్ తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన గడ్డి రమేశ్ అనే వ్యక్తి వ్యవసాయ బావిలో పడి పది రోజుల క్రితం మృతిచెందగా.. బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు శుక్రవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు సతీష్, సురేష్, గుండ్ల రాజయ్య, భీమరి శేఖర్, భూక్య రాజ్యానాయక్, బొంబోతుల అంజయ్య, భూక్య లింగంనాయక్, రాజు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: వెంకంపేటకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పుల్లయ్యగారి స్వప్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. తక్షణ సహాయార్థం స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజు 50 కిలోల బియ్యాన్ని మృతురాలి కుటుంబానికి అందించారు.



నగదు అందిస్తున్న మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు

పెట్రోల్‌బంక్ ఎన్‌వోసీ రద్దు చేయాలి

బోయినపల్లి: వెంకట్రావుపల్లి గ్రామ పరిసరాల్లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న పెట్రోల్‌బంక్ తప్పుడు ఎన్‌వోసీ రద్దు చేసి నిర్మాణం నిలిపివేయాలని గ్రామానికి చెందిన బూర్గుల నందయ్య జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎంపీడీవో బీమా జయశీలకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. నూతన గెజిట్ ప్రకారం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 436 సర్వే నంబర్‌కు సంబంధించిన ఎన్‌వోసీని ఎలాంటి సమాచారం లేకుండా, నర్సింగాపూర్ గ్రామ పంచాయతీ వారు ఇచ్చారని ఎన్‌వోసీ ఇవ్వడం సరికాదని పేర్కొన్నాడు. ఈ విషయంలో నర్సింగాపూర్ జీపీ కార్యదర్శి, మండల పంచాయతీ అధికారులతో మాట్లాడితే స్పందించడం లేదని తెలిపారు.



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న నందయ్య

చిత్ర కథ



నిర్లక్ష్యపు తుప్పు..

చందుర్తి: చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి 2014వ సంవత్సరంలో ట్రాక్టర్‌ను జిల్లా కేడీసీసీ బ్యాంకు సహకారంతో అందజేశారు. ట్రాక్టర్‌ను రెండు సంవత్సరాల పాటు లీజుకిచ్చి నడిపించారు. ఆ తర్వాత మెయింటనెన్స్ లేక రిపేర్‌కొచ్చింది. ట్రాక్టర్ ఎందుకు పనికి రాకుండా పోతోందని, పాలకవర్గం వేలం పాట ద్వారానైనా విక్రయించి వచ్చిన సొమ్మును సంఘంలో జమ చేయాలని సంఘం పరిధిలోని రైతులు పలుమార్లు పాలకవర్గాన్ని కోరారు. నిర్లక్ష్యంగా వదిలేయడంతో రోజురోజుకు తుప్పు పట్టడమే కాకుండా.. మార్కెట్‌లో ట్రాక్టర్ విలువ తగ్గి రెండు రకాలుగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

త్వరగా మిల్లులకు తరలించండి

సాక్షి స్పందన



మర్రిపల్లి రైస్ మిల్లులో పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

రుద్రంగి/వేములవాడరూరల్: ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల సిబ్బందిని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కొనుగోళ్లు పూర్తయ్యేదెప్పుడో అనే కథనానికి స్పందించి రుద్రంగిలోని కేంద్రాలను పరిశీలించారు. లారీల కొరత లేకుండా చూడాలన్నారు. రుద్రంగి మండల కేంద్రం, వేములవాడ మండలం మర్రిపల్లిల్లోని రైస్ మిల్లులను సందర్శించారు. లారీల నుంచి ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని మిల్లర్లకు సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్, తహసీల్దార్ శ్రీలత ఉన్నారు.

అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, యువకులతో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సహకరించిన విధంగా రానున్న లోకల్ బాడి ఎన్నికల్లో సహకరించాలన్నారు. జూన్ 4 వరకు ఎలెక్షన్ కోడ్ ఉంటుందని అన్నారు. ఉరుములు, పిడుగులతో కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు లచ్చయ్య, బాబు, నయీమ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో ఉరుములు, పిడుగులతో కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమాకాంత్ సూచించారు. పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మాట్లాడుతూ.. గురువారం జిల్లాలో పిడుగులు పడడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారన్నారు.

బోయినపల్లి: ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దూలం పృథ్వీధర్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ తీగల కింద ఉండొద్దన్నారు. తక్షణ సాయం కోసం 100 నంబర్‌కు సమాచారమందించాలని కోరారు.



వీర్నపల్లి: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

అందుబాటులో జీలుగ విత్తనాలు

గంభీరావుపేట: గంభీరావుపేట, కొత్తపల్లి సింగిల్ విండోల్లో 60 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్, ఏఈవోలు సాయి, ప్రవీణ్, అనూష తెలిపారు. రైతులు 30 కిలోల బస్తాకు రూ.1,116 చెల్లించాల్సి ఉంటుందని, బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులు, ఫోన్ నంబర్లతో సహకార సంఘాల్లో సంప్రదించాలని సూచించారు.

గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

సిరిసిల్లకల్చరల్: రానున్న విద్యాసంవత్సరానికి జిల్లాలో సిరిసిల్ల, మానాలలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాంతీయ సమన్వయాధికారి డీఎస్ వెంకన్న ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీతోపాటు అకౌంట్స్, ట్యాక్సేషన్ గ్రూపుల్లోని సీట్ల కోసం గిరిజన, గిరిజనేతర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఆసక్తిగల వారు తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలోని గురుకుల కళాశాలలో ఈనెల 25న నిర్వహించే కౌన్సెలింగ్‌కు పదో తరగతి మెమోతోపాటు ఇతర సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 63007 94868లో సంప్రదించాలని కోరారు.

ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని దోర్కా కుట్టు మిషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా ఇస్తున్న కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని రియల్ ఇండియా మినిస్ట్రీస్ అధ్యక్షుడు జయకుమార్, దోర్కా కుట్టు మిషన్ జాతీయ అధ్యక్షురాలు సుజాతరాణి అన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తి చేసిన వారికి శుక్రవారం ఉచిత కుట్టు మిషన్లతోపాటు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కుట్టు శిక్షణ నేర్చుకునే స్తోమత లేనివారికి ఉచితంగా 2 సంవత్సరాల నుంచి కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇప్పటివరకు 100 మందికి శిక్షణ ఇచ్చామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని, నిరుపేద మహిళలు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు తబిత, మధు, శివరాత్రి లక్ష్మణ్, రామిండ్ల సంపూర్ణ, సౌందర్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అటెన్షన్ ప్లీజ్



ఎప్పుడు కూలుతుందో ఏమో..

కోనరావుపేట: నిజామాబాద్‌లో నీటి ట్యాంక్ ప్రమాదకరంగా మారింది. ట్యాంకుకున్న పిల్లర్లు, ట్యాంకు అడుగు భాగాన సిమెంట్ రాలి సలాక తేలుతోంది. పిల్లర్లు, ట్యాంక్ భాగాలు శిథిలమవుతున్నాయి. ఇళ్ల మధ్యున్న ఈ ట్యాంక్ ఎప్పుడు కూలుతుందోనని చుట్టుపక్కల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ ట్యాంక్ పక్కనుంచే ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి, రైతు వేదికకు దారి ఉంది. ఈ దారిలో ప్రతిరోజూ ప్రజలు, గర్భిణులు, రైతులు వెళ్తుంటారు. ఈ ట్యాంకును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వెంకట్‌రెడ్డికి డాక్టరేట్



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి అమెరికన్ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. వెంకట్‌రెడ్డి చేసిన సామాజిక సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. న్యూఢిల్లీలో ఈనెల 25న డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్: రామలక్ష్మణపల్లె మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించామన్నారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్

ముస్తాబాద్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేందుకు బట్టను శుక్రవారం అందజేసినట్లు ఏపీఎం దేవరాజు తెలిపారు. మండలంలో 3,673 మంది విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేందుకు ప్రభుత్వం బట్ట సరఫరా చేసిందన్నారు. ఆయా గ్రామాల్లో ఐకేపీ మహిళలతో విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టించేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. ప్రధానోపాధ్యాయులకు బట్టను అందించామన్నారు. పాఠశాలల పునః ప్రారంభం లోగా ఐకేపీ మహిళలు విధిగా యూనిఫామ్స్‌ను అందించాలని కోరారు. నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, సీసీలు లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, సీఏలున్నారు.



యూనిఫామ్స్ మెటీరియల్ తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు